పుస్తకం.. హస్తభూషణం

పుస్తకం హస్తభూషణం అన్నారు పెద్దలు. మంచిపుస్తకం మన చెంత ఉంటే మంచి మిత్రుడు మన వెంట ఉన్నట్టే అంటారు. సెల్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ విరివిగా వాడుతున్న ఈ ఆధునిక కంప్యూటర్ యుగంలో కూడా పుస్తకానికి ఆదరణ తగ్గలేదు. పుస్తక ప్రియులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుని ప్రపంచాన్నే జయిస్తున్నారు. డిజిటల్ రంగంలోనూ పుస్తకాదరణ ఏ మాత్రం తగ్గలేదనడానికి పుస్తక ప్రదర్శనలకు లభిస్తున్న విశేష ఆదరణే నిదర్శనం అని చెప్పొచ్చు.

- గ్రంథ పఠనానికి తగ్గని ఆదరణ
- డిజిటల్ యుగంలోనూ అంతే ఆసక్తి
- విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనలో కొలువుదీరిన వేలాది గ్రంథాలు
- భారీగా పుస్తకాలు కొనుగోలు చేస్తున్న పాఠకులు, విద్యార్థులు



తెలుగులోకి అనువాదమైన ఆంగ్ల గ్రంథాలు



సాహితీ ప్రియుల కోసం కొలువుదీరిన గ్రంథాలు

జగదాంబ: టర్నర్ చౌల్ట్రీలో కొనసాగుతున్న **విశాలాంధ్ర** పుస్తక ప్రదర్శన అన్ని వర్గాల వారినీ ఆకట్టుకుంటోంది. మహిళలు, పిల్లలు, వృద్ధులు కోరుకునే అన్ని రకాల పుస్తకాలు ఈ ప్రదర్శనలో రాయితీ ధరతో లభ్యం కావడంతో సాహితీప్రియులు విరివిగా పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. టీవీ, సినిమా మాధ్యమాలు రాజ్యమేలుతున్న ఈ కాలంలో పుస్తకాలకు ఆదరణ తగ్గిందనే వాదనకు తెర దించుతూ విశాలాంధ్ర ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు పాఠకుల నుంచి చక్కటి ఆదరణ లభిస్తోంది.

పోటీ పరీక్షల కోసం..

యువత, నిరుద్యోగులకు పోటీ పరీక్షల కోసం గ్రూప్ 1,2,3, పోలీసు కానిస్టేబుల్స్, రైల్వే, ఆర్ఆర్‌బీ, బ్యాంక్ ఉద్యోగులతో పాటు పలు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు ఈ ప్రదర్శనలో లభిస్తున్నాయి.



చిన్నారుల కోసం పెద్దబాలశిక్ష

ఆధ్యాత్మిక గ్రంథాలు..

చదువరుల్లో ఆధ్యాత్మికతను పెంచే పలు గ్రంథాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. రామాయణం, మహాభారతం, భాగవతం, సుందరకాండ, మార్కండేయ పురాణం వంటి వాటితో పాటు ఎన్నో తెలుగు, హిందీ, ఆంగ్లభాషా గ్రంథాలు లభ్యమవుతున్నాయి. అలాగే పెద్ద బాలశిక్ష పుస్తకాలు కూడా ఈ ప్రదర్శనలో లభిస్తున్నాయి.

అందుబాటులో వివిధ భాషల సాహిత్యం..

తెలుగులో వెలువడిన పుస్తకాలు మాత్రమే కాకుండా ఆంగ్లం, హిందీతో పాటు పలు భాషలకు చెందిన ప్రముఖ రచయితల గ్రంథాలు ఈ ప్రదర్శనలో లభిస్తున్నాయి. లియో టాల్‌స్టాయ్, హ్యారీపోటర్ సిరీస్ నవలలు, మాక్సిమ్‌గోర్కీ, షేక్‌స్పియర్, చార్లెస్ డికెన్స్, పీబీ షెల్లీ వంటి ఆంగ్ల సాహితీ దిగ్గజాల పుస్తకాలు కూడా ప్రదర్శనలో ఉంచారు. తెలుగులో గురజాడ, కందుకూరి వీరేశలింగం, చలం, శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), విశ్వనాథ సత్యనారాయణ, రావిశాస్త్రి, గుర్రం జాషువా, యండమూరి, మల్లాది, యద్దనపూడి సులోచనారాణి, మధుబాబు, గొల్లపూడి మారుతీరావు వంటి దిగ్గజ రచయితల నవలలు అందుబాటులో ఉన్నాయి.

చిన్నారుల కోసం..

పిల్లల్లో ఆసక్తి పెంచే చిట్టి కథలు, నీతి కథలు, ఆధ్యాత్మిక బొమ్మల కథలు కూడా లభిస్తున్నాయి. వీటితో పాటు పిల్లలు మెచ్చే కార్టూన్స్, కామిక్ పుస్తకాలను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు.

30 వేల పుస్తకాలు ఒకే చోట..

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన మొదట్లో 10 వేల పుస్తకాలతో ప్రారంభం అయింది. అది నానాటికీ పెరిగి నేడు దాదాపు 30 వేల పుస్తకాలకు చేరుకోవటం అంటే పుస్తకాల పట్ల సాహితీప్రియుల్లో ఆదరణ తగ్గలేదనడానికి ప్రబల నిదర్శనం అని చెప్పక తప్పదు. అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునే విధంగా పిల్లలు, మహిళలు, సాహితీ ప్రియులు, వృద్ధులు, ఉద్యోగులకు అందుబాటులో పలు రకాల పుస్తకాలు, సాహితీ గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి.

మహిళలను ఆకట్టుకునేలా..

మహిళల కోసం వంటల పుస్తకాలు, స్వయం ఉపాధికి ఊతంగా నిలిచే బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, మెహందీ డిజైన్, ఆరోగ్య సూత్రాలు, చిట్కాలు, ముగ్గుల పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు.

ఆదరణ బాగుంది..



ప్రతి ఏటా విశాలాంధ్ర పుస్తక ప్రదరన ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిసారిలాగే ఇప్పుడు కూడా ప్రదర్శనకు చక్కటి ఆదరణ లభిస్తోంది. కొనుగోలుదారులకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నాం. పుస్తక ప్రియులకు కావల్సిన అన్ని పుస్తకాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి.

– పీఏ రాజు, విశాలాంధ్ర బుక్ డిపో మేనేజర్

మానసిక దివ్యాంగురాలికి ఆశ్రయం

నెల్లూరు నుంచి విశాఖ వచ్చేసిన యువతి



నెల్లూరుకు చెందిన హర్షిత

సీతమ్మధార: నెల్లూరుకు చెందిన 18 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు హర్షితకు విశాఖలో ఆశ్రయం కల్పించారు. కంట్రోల్ రూమ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఫోర్త్ టౌన్ నైట్ బీట్ సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో యువతిని కనుగొని వివరాలు ఆరా తీశారు. తన పేరు హర్షిత అని, సొంతూరు నెల్లూరు జిల్లా నుంచి 14 రోజుల కిందట విశాఖ వచ్చేసినట్లు చెప్పింది. ఆరు రోజుల కిందట జీఆర్పీ పోలీసులు హర్షితను గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో ఉంచగా.. అక్కడ నుంచి వచ్చేసి, తిరిగి ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుండగా.. ఫోర్త్ టౌన్ పోలీసులు సంరక్షించారు. అమ్మాయి తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్ తెలుసుకొని సమాచారం అందించామని, వారు నెల్లూరు నుంచి బయలుదేరి వస్తున్నట్లు ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపారు. అంతవరకు హర్షితను ఉమెన్ పోలీస్ సహాయంతో ద్వారకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు.

సిరి వినాయక ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

అల్లిపురం: నేరెళ్లకోనేరులో వెలసిన శ్రీ సిరి వినాయక ఆలయ 22వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమయింది. దీంట్లో భాగంగా ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషంగా పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత సిరి వినాయకుడిని విశేషంగా అలంకరించి, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, మహిళల కోలాటాల మధ్య జరిగిన తిరువీధి ఉత్సవం నేరెళ్లకోనేరు, సిరి వినాయక దేవాలయం నుంచి ప్రారంభమై మార్కెట్‌రోడ్డు, కర్ణాలవీధి, చెరువుగట్టు, గోకుల్ థియేటర్ రోడ్డు, చావులమదుం, హరిత లాడ్జి మీదుగా తిరిగి సిరి వినాయక దేవాలయం వరకు సాగింది.

క్లుప్తంగా

వృద్ధులకు ఆశ్రయం



వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: చలి తీవ్రత పెరగడం వల్ల రోడ్ల మీదే కాలం వెళ్లదీస్తున్న వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏయూటీడీ సంస్థ నిరంతరం రెస్క్యూ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నడవలేని స్థితిలో ఉన్న ఐదుగురు పురుషులు, ఇద్దరు స్త్రీలను ద్వారకానగర్ టీఎస్ఆర్. కాంప్లెక్సులో గల జీవీఎంసీ నిరాశ్రయుల వసతిగృహాలకు తరలించారు. రాజన్ (42, ఉత్తరప్రదేశ్), అరటివట్ల చిన్నారావు (55, గోపాలపట్నం), సుభాలాల్ (82, మధ్యప్రదేశ్), చల్లం నాయుడు (70), యలమంచిలి శ్రీనివాసరావు (52, విజయవాడ), స్వారంపూడి వసుంధర (65, కొత్తవలస), తాటి రాణి (40, విజయవాడ) తదితరులకు పురుషులు, మహిళల షెల్టర్లలో విడివిడిగా ఆశ్రయం కల్పించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల బెడద వదిలించాలని వినతి



పూటుగా మద్యం సేవించి పడి ఉన్న మందుబాబు

దాబాగార్డెన్స్: నిత్యం మద్యం సేవించి ఇబ్బందులకు గురి చేస్తున్న మందుబాబుల చిందులపై పోలీసులు చర్యలు చేపట్టాలని పాతనగరానికి చెందిన డాక్టర్ ఎం. రియాజ్ అహ్మద్ 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. బీచ్‌రోడ్డు ఫిషింగ్ హార్బర్ వాటర్ ట్యాంక్ సమీపాన తమది హోమియో క్లినిక్ ఉందని, క్లినిక్‌కు వృద్ధులు, మహిళలు వస్తుంటారని, వారి పట్ల మందుబాబులు అసహ్యంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. హోమియో క్లినిక్‌కు సమీపానే మద్యం దుకాణం ఉండడం వల్ల చాలా మంది మద్యం సేవిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పోలీసులు చర్యలు చేపట్టి, మందుబాబుల బెడద తప్పించాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ ర్యాలీ విజయవంతానికి పిలుపు

దాబాగార్డెన్స్: కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 23న నిర్వహించనున్న బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని మోదీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చాయన్నారు. ఆ రోజున దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ పార్కు వరకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 23 ఉదయం 10 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకసేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

మాతృ మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే సంబంధిత వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇటీవల రెండు మాతృ మరణాలు సంభవించాయని, వాటిపై సంబంధిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది కారణాలు చెప్పాలని కోరారు. వీటిపై యూపీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలతో చర్చించారు. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకటి, స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధి న్యూపిఠాపురం కాలనీలో ఒక మాతృ మరణం సంభవించాయని అన్నారు. గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ప్రసవించే వరకు, ప్రసవానంతరం సైతం సక్రమ సేవలందించాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీ శంకర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ షరిమ్మల, డాక్టర్ రేణుక, విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రేణుక, డాక్టర్ జి.వి.గణేష్, డాక్టర్ సి.బి.నాయుడు, బ్లడ్ బ్యాంకుకు చెందిన ఐ.మనోరమ, 108 సేవల జిల్లా మేనేజర్ త్రినాథ్, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు, పినాకిల్ ఆస్పత్రి, కృష్ణ మెటర్నిటీ ఆస్పత్రి, జ్యోతి నర్సింగ్ హోం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

తోటి విద్యార్థులే దాష్టీకానికి పాల్పడటం దారుణం

సీతమ్మధార: తోటి విద్యార్థులే యువతిని అత్యాచారం చేయడం దారుణం అని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె. పద్మ అన్నారు. లా కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనను ఖండిస్తూ మహిళా చేతన ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కు దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో న్యాయ కళాశాల విద్యార్థినిపై సహ విద్యార్థులే సామూహిక అత్యాచారానికి పాల్పడటం సమాజాన్ని కలవరపరిచిందన్నారు. ప్రేమ పేరుతో ఆడపిల్లల్ని ఉచ్చులో దింపి, అఘాయిత్యాలకు పాల్పడటం, పెళ్లికి ముఖం చాటేయడం సాధారణం అయిపోయిందని తెలిపారు. మొబైల్ కెమెరాల్లో అత్యాచార ఘటనలను చిత్రీకరించి బెదిరించి అత్యాచారానికి పాల్పడడం దారుణం అన్నారు. అది కూడా లా చదువుతున్న విద్యార్థులు చేయడం ఎంతో అమానుషం అని తెలిపారు. న్యాయ విద్యార్థిని కేసులో నిందితులను త్వరితగతిన విచారించి, కఠినంగా శిక్షించాలని మహిళా చేతన డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పీకేఎస్ అన్నపూర్ణ, హెచ్ఆర్ఎఫ్ అనురాధ, న్యాయవాది జహర, భారత నాస్తిక సమాజం సభ్యులు వై. నూకరాజు, రామ ప్రభ, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా చేతన కార్యదర్శి పద్మ

ఫాగింగ్‌తో దోమల నివారణ

జగదాంబ: దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన జోన్ పరిధి 28వ వార్డులోని పందిమెట్ట, నౌరోజీరోడ్డు, దస్‌పల్లా హిల్స్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మలేరియా విభాగం సిబ్బందితో నౌరోజీ రోడ్డు వద్ద గల మురుగు కాలువలో ఫాగింగ్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ముందస్తుగా యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలన్నారు. రహదారి పక్కన గల కాలువలు, ఇళ్ల సమీపంలో అలా చేస్తే దోమలను నివారించవచ్చన్నారు. అనంతరం ఆయన రహదారులు, కాలువలను, ప్రధాన రహదారుల పక్కన గల చెత్తకుప్పలను పరిశీలించారు. ప్రతి రహదారిలో తప్పకుండా డంపర్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయాల వద్ద మూడేసి బిన్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలా చేసినప్పుడు చెత్త రోడ్డుపై వేయరన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నౌరోజీ రోడ్డులోని కాలువలో ఫాగింగ్ చేయిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌ను ఈసై ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ క్యో తోడా శుక్రవారం ప్రారంభించారు. ఈ అత్యాధునిక సదుపాయం సరికొత్త ల్యాప్రోస్కోపిక్ సాంకేతికతను కలిగి ఉంది. ఇది శస్త్రచికిత్సలో మెరుగైన ఫలితాలు అందిస్తూ, రోగులు కోలుకునే సమయాన్ని తగ్గిస్తుంది. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ ఆధునికీకరణకు రూ. 40 లక్షలు, ల్యాప్రోస్కోపిక్ పరికరం కోసం రూ. 10 లక్షలు ఈసై ఫార్మాస్యూటికల్స్ సామాజిక కార్పొరేట్ బాధ్యత కింద కేజీహెచ్ పిల్లల శస్త్ర చికిత్స విభాగానికి వితరణగా అందజేసింది. ఈ సందర్భంగా ఈసై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్ దీక్షిత్, హెచ్ఆర్ సీఎస్ఆర్ ఇన్‌చార్జి జోసెఫ్ కిరణ్‌లను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు సత్కరించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, పిల్లల శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న క్యో తోడా

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం నేరం



ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దని వ్యాపారికి చెబుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించకూడదని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం జోన్ పరిధిలోని రామకృష్ణా జంక్షన్ వద్ద ఆయన చిరు వ్యాపారులతో మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించవద్దని చెప్పారు. ఇప్పటికే మార్కెట్‌లో దాదాపు తక్కువ మైక్రాన్ ఉన్న కవర్ల అమ్మకాలు బాగా తగ్గాయన్నారు. అయినప్పటికీ ఇంకా చిరు వ్యాపారుల వద్ద ఆ కవర్లు ఉన్నాయన్నారు. వీటి ఉపయోగం పూర్తిగా తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత వార్డు ఇన్‌స్పెక్టర్లకు తెలిపారు. వినియోగదారులు కూడా ఇంటి వద్ద నుంచే గుడ్డ సంచులు, గన్నీ బ్యాగ్‌లు తీసుకొచ్చి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల కుటుంబాల సంక్షేమానికి కృషి



సైనిక బోర్డు సమావేశంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: సైనికుల కుటుంబాల సంక్షేమానికి జిల్లా సైనిక్ బోర్డ్ కృషి చేయాలని కలెక్టర్, జిల్లా సైనిక బోర్డు చైర్మన్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సైనిక్ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ వితంతువులు/యుద్ధంలో అంగవైకల్యం పొందిన సైనికులకు ఇళ్ల స్థలాలు మంజూరు, ఇంటిగ్రేటెడ్ సైనిక్ భవన్ భూమి కేటాయింపు, శౌర్య పురస్కారాలు పొందే వారికి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందంను ఆదేశించారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో వాచ్‌మన్ పోస్ట్ భర్తీ, తదితర అంశాలను సమీక్షించి అధికారులకు తగిన సూచనలు చేశారు. జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.ఎం.భాష తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సేవలపై అవగాహన కల్పించండి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమా సంస్థ (ఏపీజీఎల్ఐ) జోన్-1 శాఖాధిపతి రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం విశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీజీఎల్ఐ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పాలసీదారులకు రుణాలు మంజూరు చేయడం, క్లెయిమ్‌లను పరిష్కరించడం వంటి అంశాల్లో కార్యాలయ సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈ సంస్థ అందిస్తున్న సేవల గురించి మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సమీక్షలో రాష్ట్ర సహాయ సంచాలకులు ఎ.ఆర్.కె నాయుడు, ఉమ్మడి విశాఖ ఏపీజీఎల్ఐ కార్యాలయ సంయుక్త సంచాలకులు ఎం.ఝాన్సీ లక్ష్మి, సహాయ సంచాలకుడు కె.కనికరం బాబు, పర్యవేక్షకుడు జి.మధుసూదనరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. భవితకు సోపానం

దాబాగార్డెన్స్: రామ్‌నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు, లైబ్రరీ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె. సోమశేఖర్‌రావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గ్రంథాలయాల పట్ల, వాటి ఆవశ్యకత గురించి దిశా నిర్దేశం చేశారు. పుస్తక పఠనం.. భవితకు సోపానం అని విశదీకరించారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని, అందుకు అనుగుణంగా విద్యార్థులు ఎక్కువ సమయం గ్రంథాలయాల్లో గడిపి వారి ఉన్నతికి, ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా క్రమశిక్షణ, విలువలు, జ్ఞానం, వివేకం కలిగి చక్కటి జీవితం లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు విజ్ఞాన దాయకమైన, స్ఫూర్తివంతమైన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ, డిగ్రీ కళాశాల డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, లైబ్రేరియన్ కుమారి, బి.చిన్ని, వైస్ ప్రిన్సిపాల్ హిమశేఖర్, తెలుగు అధ్యాపకుడు సోమేశ్వరశర్మ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ సోమశేఖరరావు

28న జీవీఎంసీ దుకాణాలకు వేలం

దాబాగార్డెన్స్: జోన్-5 పరిధిలో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్క మార్కెట్లకు ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి. రాము ఒక ప్రకటనలో తెలిపారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 22, 24, 48, 52, 54, 55, 56, 57, 58 దుకాణాలు, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నంబరు 1, సుబ్బలక్ష్మీనగర్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నంబరు 1, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నంబరు 1లకు మూడేళ్ల కాలపరిమితికి, అలాగే 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లల పాలెం దుకాణం రోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి, కంచరపాలెం, అక్కయ్యపాలెం రోడ్డు పక్క మార్కెట్‌కు ఏడాది కాల పరిమితికి అద్దెకిచ్చేందుకు ఆ రోజు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్టు చెప్పారు. వేలంలో పాల్గొనే ఆసక్తి గల వారు ధరావతు సొమ్ము, తదితర పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయం పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని తెలిపారు.

బాలల సంక్షేమానికి సమన్వయంతో పనిచేయాలి

మహారాణిపేట: రాష్ట్రంలో బాలలందరికీ చదువు, ఆరోగ్యం, పౌష్టికాహారంతో పాటు భద్రత ముఖ్యమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఇటీవల గుంటూరులో శిక్షణ పొందిన శిక్షకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో మమేకమై పని చేస్తున్న అధికారులు, వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు విశాఖ జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. బాలలు దురలవాట్లు, చెడు స్నేహాలు, సోషల్ మీడియా, డ్రగ్స్, సైబర్ క్రైమ్‌కు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ బాలలందరూ లైఫ్ స్కిల్స్‌తో పాటు స్వయం రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బాల కార్మికులుగా మారకుండా, బాల్య వివాహాలు జరగకుండా అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, మహిళా పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లీశ్వరి, ఆనందపురం ఎంపీడీవో జానకి, జిల్లా ఒకేషనల్ అధికారి రాధ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, ఐసీపీయూ ప్రతినిధులు ఆనంద్, అనీజా, మమత, శకుంతల, అప్ హోల్డ్ సంస్థ ప్రతినిధి డేవిడ్ రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసలి అప్పారావు

ప్రయాణికుడిని దోచుకున్న వ్యక్తుల అరెస్ట్

అల్లిపురం: ఆటో ప్రయాణికుడిపై దాడికి పాల్పడి, డబ్బు, సెల్ ఫోన్ దోచుకున్న జువైనల్ సహా నలుగురు వ్యక్తులను టూటౌన్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా, బాడంగి మండలం, ముగాడ గ్రామానికి చెందిన వెంపాడపు సీతారాం చెన్నైలో కూలి పని చేసుకుంటున్నాడు. ఈ నెల 17వ తేదీన తన స్వగ్రామం వెళ్లేందుకు చెన్నై నుంచి నగరానికి రాత్రి 1.15 సమయంలో నగరానికి చేరుకున్నాడు. బాగా రాత్రి కావటంతో సుజాతానగర్‌లో తన సోదరి ఇంటికి వెళ్లిపోదామని రైల్వే స్టేషన్ సమీపంలో హరిత సర్కిల్ వద్ద ఆటో ఎక్కాడు. అప్పటికే ఆటో డ్రైవర్ కాకుండా ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ఆటో సుజాతానగర్ కాకుండా వేరే రూట్లో వెళ్తుండడటంతో సీతారాం ఆటో డ్రైవర్‌ను ప్రశ్నించాడు. దీంతో ఆటో డ్రైవర్ లీలామహల్ జంక్షన్ దగ్గర ఆటో ఆపి సీతారామ్‌ను కింద పడేసి పిడిగుద్దులు గుద్దాడు. అతని చేయి కరిచి, అతని వద్ద గల పోకో సెల్‌ఫోన్, రూ.8,500 నగదు దోచుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు టూటౌన్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం డీసీపీ కె.లతా మాధురి, ఈస్ట్ క్రైం సీఐ సీహెచ్ రాజులు నాయుడు పర్యవేక్షణలో క్రైం ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టి సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల్లో ఒక మైనరు సహా చుక్కా లోకేష్ అలియాస్ లోకి, బోను శ్రీనివాస్, కోరాడ శివప్రసాద్ అలియాస్ శివ అలియాస్ సాంబలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జువైనల్‌ను ప్రభుత్వ ప్రొటెక్షన్ హోమ్‌కు తరలించారు.